సాక్షి విశాఖపట్నం

మంగళవారం ၊ 24 ၊ జూన్ ၊ 2025



కాలుష్యంలో కలిసిన లక్ష్యం 8లో



పీజీఆర్ఎస్‌కు 383 వినతులు 8లో



వైద్య ఆరోగ్యశాఖలో నర్సుల అక్రమ బదిలీలు 8లో

కదం తొక్కిన యువత



కలెక్టరేట్‌కు ర్యాలీగా వెళ్తున్న యువత, వైఎస్సార్ సీపీ శ్రేణులు



- వర్షంలోనూ యువత పోరులో భారీగా పాల్గొన్న నిరుద్యోగులు, విద్యార్థులు
- చంద్రబాబు, పవన్ అబద్ధపు హామీలపై పెల్లుబికిన యువత ఆగ్రహం
- జనవరిలో జాబ్ క్యాలెండర్ అన్నారు.. ఇప్పుడు జూన్ నెల ముగుస్తోంది
- కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా.. మూడు లక్షల మందిని తీసేశారు
- ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు పేరుకుపోయాయి
- ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు
- జిల్లా పరిషత్ జంక్షన్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ



డీఆర్వో భవానీశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, మొల్లి అప్పారావు, దేవన్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉరుకూటి చందు, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి, యువజన విభాగం జోన్ అధ్యక్షుడు అంబటి శైలేష్

మహారాణిపేట : కూటమి ప్రభుత్వ అబద్ధపు హామీలపై యువత కదం తొక్కింది. వర్షానికి సైతం వెరవకుండా గర్జించింది. పెల్లుబికిన యువ గర్జనను అడ్డుకోవడానికి పోలీసులు చేసిన ప్రయత్నాలను తిప్పికొట్టింది. డౌన్ డౌన్ చంద్రబాబు అంటూ చేసిన నినాదాలతో కలెక్టరేట్ జంక్షన్ మార్మోగిపోయింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన యువత పోరు కార్యక్రమం హోరెత్తిపోయింది. ఎన్నికలకు ముందు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని, నిరుద్యోగ భృతిగా రూ.3 వేలు ఇస్తామని, ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పి.. అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పటివరకు వాటిని అమలు చేయకపోవడంపై వైఎస్సార్‌సీపీ యువత పోరు పేరుతో ఆందోళనకు పిలుపునిచ్చింది. దీనికి జిల్లాలో ఉన్న యువత, నిరుద్యోగులు, విద్యార్థుల నుంచి భారీ స్పందన వచ్చింది. వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది నిరుద్యోగులు, విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఒకవైపు వర్షం పడుతున్నా వెరవలేదు. భారీ సంఖ్యలో జనాలు రాకుండా పోలీసులు బారికేడ్లు, రోప్‌పార్టీలతో పద్మవ్యూహం పన్నినా వాటిని బద్దలు కొట్టుకుంటూ



ర్యాలీని అడ్డుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకేరాజు

వచ్చారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల అబద్ధపు హామీలను ఎండగట్టారు. నిరుద్యోగ భృతి ఎక్కడంటూ నిగ్గదీసి అడిగారు. చంద్రబాబుది మేనిఫెస్టో కాదని, మాయఫెస్టో అని తూర్పారబెట్టారు.

అడ్డుకోవడానికి ప్రయత్నించినా..

యువత పోరులో భాగంగా ముందుగా జిల్లా పరిషత్ నుంచి ర్యాలీ చేపట్టారు. ఉదయం నుంచి వర్షం పడుతున్నప్పటికీ.. ఈ నిరసన కార్యక్రమానికి భారీగా యువత, నిరుద్యోగులు వస్తుండడంతో వారిని నిలువరించేందుకు పోలీసులు ప్రయత్నించారు. జెడ్పీ నుంచి కలెక్టరేట్ లైన్‌లో బారికేడ్లు, రోప్ పార్టీలు పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారు తప్పించుకుంటూ కలెక్టర్ వరకు ప్రభుత్వానికి, చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి ర్యాలీగా తరలి వచ్చారు.

కూటమి ప్రభుత్వంలో ముగ్గురికే జాబ్‌లు వచ్చాయి..

ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 20 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి పేరుతో యువతను మోసం చేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎంగా చంద్రబాబుకు, డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్‌కు, మంత్రిగా లోకేష్‌లకు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వకపోగా.. 2.6 లక్షల మంది వలంటీర్లను, ఎండీయూ వాహనాల్లో పనిచేసే 20 వేల మందిని, లిక్కర్ షాపుల్లో పనిచేసే 15 వేల మందిని తొలగించి వారి పొట్టకొట్టిందని గుర్తు చేశారు. జనసేన ప్లీనరీలో ప్రతి నియోజకవర్గంలో 500 మంది యువత స్వయం ఉపాధికి ఒక్కొక్కరికీ రూ.10 లక్షలు



కలెక్టరేట్‌కు వెళ్తున్న యువత, వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు



ఇస్తామని చెప్పిన పవన్ కల్యాణ్ ఒక్కరికి అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. తన సొంత నియోజకవర్గం పిఠాపురంలో కూడా ఇవ్వలేదన్నారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని లోకేష్ హామీ ఇచ్చారని, ఇప్పుడు జూన్ కూడా దాటిపోతోందని, జాబ్ క్యాలెండర్ ఎక్కడని ప్రశ్నించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం డీఆర్వో భవానీ శంకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ పరిశీలకుడు కదిరి బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, మళ్ల విజయ్‌ప్రసాద్, తిప్పల దేవన్‌రెడ్డి, మొల్లి అప్పారావు, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, మాజీ ఎమ్మెల్యేలు తైనాల విజయకుమార్, చింతలపూడి వెంకటరామయ్య డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉరుకూటి చందు, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి దొడ్డి కిరణ్, యువజన విభాగం అధికార ప్రతినిధి మహ్మద్ ఇమ్రాన్, యువజన విభాగం జోనల్ అధ్యక్షుడు అంబటి శైలేష్, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు కొండా రెడ్డి, నాగేంద్ర, రాష్ట్ర నాయకులు, రాష్ట్ర మాజీ చైర్మన్లు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నేతలు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నిరుద్యోగులను ముంచేశారు..

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు మాట్లాడుతూ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను నిలువునా ముంచిందని విమర్శించారు. 20 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు గానీ, రూ.3 వేలు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మరోసారి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త ఉద్యోగాలు ఇవ్వకపోగా.. ఉన్న ఉద్యోగులను తీసివేస్తూ వారి పొట్ట కొడుతోందని మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో షెడ్యూల్ ప్రకారం ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన, విద్యా దీవెన నిధులు విడుదల చేస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఏడాదిలో రూ.7,800 కోట్లు బకాయిలు పెట్టిందని వెల్లడించారు. బడ్జెట్‌లో మాత్రం కేవలం రూ.2,600 కోట్లు మాత్రమే పెట్టినట్లు వివరించారు. ప్రతి జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పిన లోకేష్ తన ఉద్యోగం, తన సంపాదన చూసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటి వరకు నిరుద్యోగుల కోసం పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వెన్నుపోటు దినం పేరుతో వైఎస్సార్ సీపీ ఆందోళన చేపట్టడంతోనే కూటమి ప్రభుత్వం తల్లికి వందనం ఇచ్చిందని గుర్తు చేశారు. ఇప్పుడు నిరుద్యోగులు, యువత, విద్యార్థుల తరపున పోరాటం చేసి వారందరికీ న్యాయం జరిగేలా చూడడమే తమ లక్ష్యమన్నారు.

ఎక్కువ మంది వచ్చారని కేసు

అల్లిపురం : వైఎస్సార్ సీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన యువత పోరుకు అనుమతి కంటే ఎక్కువ మంది హాజరయ్యారని.. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు మహారాణిపేట సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పబ్లిక్ సర్వెంట్ విధులను నిర్వర్తించకుండా అడ్డుకున్నందుకు, దాడి చేసినందుకు సెక్షన్ 132, 121(1), ఎక్కువ మంది గుమిగూడినందుకు 189(2), 191(2), 190 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

లంకెలపాలెం జంక్షన్‌లో ఘోర ప్రమాదం

ముగ్గురి మృతి.. ఏడుగురికి తీవ్ర గాయాలు



సంఘటన స్థలంలో మృతదేహాలు



కొణతాల అచ్చన్నాయుడు, పచ్చికూర గాంధీ (ఫైల్)

పరవాడ/అనకాపల్లి టౌన్ : లంకెలపాలెం ప్రధాన జంక్షన్‌లో సోమవారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. గాజువాక నుంచి అనకాపల్లి వైపు వెళ్తున్న మార్కెట్ లారీ బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో ఈ ప్రమాదం జరిగింది. ఫార్మాసిటీలో విధులు ముగించుకుని వస్తున్న ఉద్యోగుల కారును ఢీకొనగా అందులో ఉన్న ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరు గాయపడ్డారు. అనంతరం ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనగా.. దానిపై ప్రయాణిస్తున్న ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రగాయాలపాలయ్యాడు. తరువాత బొలేరో వాహనం, కంటైనర్, మరో రెండు ద్విచక్రవాహనాలను ఢీకొనగా నలుగురు గాయపడ్డారు. మృతుల్లో అనకాపల్లికి చెందిన కొణతాల అచ్చన్నాయుడు (52), అనకాపల్లి మండలం రేబాకకు చెందిన పచ్చికూర గాంధీ (47), అగనంపూడికి చెందిన ఫార్మా ఉద్యోగి ఎర్రప్పడు (35) ఉన్నారు. మృతదేహాలను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను సమీప ఆస్పత్రుల్లో చేర్పించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మద్యం మత్తులో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. క్షతగాత్రుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది.



ప్రమాదానికి కారణమైన లారీని తొలగిస్తున్న దృశ్యం

ఎంటీఎస్ టీచర్స్ ఆగ్రహం



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న ఎంటీఎస్ టీచర్స్

టీచ్‌రోడ్డు: మినిమమ్ టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్లు తమకు నివాస స్థలాలకు దగ్గరలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. కనీస వేతనంపై సేవలు అందిస్తున్న తమకు ఆర్థిక ఇబ్బందులు లేకుండా సొంత ప్రాంతాలకు దగ్గరలోనే పోస్టింగ్ ఇవ్వాలని పేర్కొన్న జీవో నంబర్ 39ను కూటమి ప్రభుత్వం పక్కన పెట్టిందని టీచర్లు ఆరోపించారు. అతి తక్కువ వేతనంతో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న తమ పట్ల కూటమి ప్రభుత్వం కక్షగట్టినట్లు వ్యవహరిస్తోందని వారు మండిపడ్డారు. జీవో 39కు విరుద్ధంగా 60–70 కిలోమీటర్ల దూరంలో పోస్టింగ్ ఇవ్వడం దారుణమన్నారు. అతి తక్కువ జీతంతో అంత దూరం వెళ్లి పనిచేయలేమని, తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో పోస్టింగ్ అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని ఎంటీఎస్ టీచర్లు హెచ్చరించారు.

ఏఎన్ఎంల ఆందోళన



డీఎంహెచ్‌వో కార్యాలయం ఎదుట ఏఎన్ఎంల ఆందోళన

మహారాణిపేట : పదోన్నతుల జాబితా ప్రకటించడంలో జరుగుతున్న ఆలసత్వాన్ని ఖండిస్తూ రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఎదుట ఏఎన్ఎంలు సోమవారం ఆందోళనకు దిగారు. యునైటెడ్ గ్రామ వార్డు హెల్త్ సెక్రటరీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. అసోసియేషన్ నాయకురాలు పి.మణి మాట్లాడుతూ సచివాలయ ఏఎన్ఎంలకు పదోన్నతులు ఇవ్వాలని ఆదేశాలు ఉన్నప్పటికీ, డీఎంహెచ్‌వో ఇప్పటివరకు పట్టించుకోలేదని ఆరోపించారు. పదోన్నతుల విషయమై డీఎంహెచ్‌వోకు పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. డీఎంహెచ్‌వో వైఖరి వల్ల ఏఎన్ఎంలు తీవ్రంగా నష్టపోతున్నారని, తప్పనిసరి పరిస్థితుల్లోనే తాము ఆందోళనకు దిగామని స్పష్టం చేశారు. అసోసియేషన్ రాష్ట్ర నాయకురాలు దేవకి మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో ఏఎన్ఎంల పదోన్నతుల ప్రక్రియ పూర్తయిందని, విశాఖలో మాత్రం జాబితాలు తయారు చేయకపోవడం అన్యాయమని పేర్కొన్నారు. దీనిపై స్పష్టమైన హామీ ఇచ్చే వరకు తమ ఆందోళన కొనసాగుతుందని ఆమె హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు రత్నం, పద్మ, కృష్ణవేణి, సుభాషిని, కుమారి, అలాగే యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు చుక్కల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల నిరసన

టీచ్‌రోడ్డు : గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తమ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. ఉద్యోగుల ఐక్య వేదిక జేఏసీ ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాన సమస్యలతోపాటు, ఆర్థికేతర అంశాలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వం 75వ శాఖగా ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయ శాఖకు నేటికీ చట్టబద్ధత కల్పించలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం క్యాబినెట్‌లో చర్చించి వదిలేసిందని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా ఈ అంశాన్ని క్యాబినెట్‌లో చర్చించలేదని విమర్శించారు. తమకు నిర్దిష్టమైన సర్వీస్ రూల్స్ లేవని, అలాగే పదోన్నతి మార్గం కూడా లేదని ఉద్యోగులు వాపోయారు. అన్ని ప్రభుత్వ శాఖల విధులు నిర్వర్తిస్తున్నా తమకు ప్రమోషన్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. రేషనలైజేషన్ పేరుతో ఉద్యోగాలను రద్దు చేసి, ఎక్కడకు పంపిస్తారో చెప్పకుండానే బదిలీలు చేస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యంగా మహిళా పోలీసులు బదిలీల వల్ల నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదేళ్లు నిండని వారికి, కొత్తగా బదిలీపై వచ్చిన వారికి బదిలీ ఆప్షన్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్లు, తొమ్మిది నెలల ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలకు న్యాయం చేయకపోతే రానున్న రోజుల్లో నిరసనలను వివిధ రూపాల్లో కొనసాగిస్తామని, ప్రజా స్పందన కార్యక్రమాల్లోనూ తమ అర్జీలను ప్రభుత్వానికి తెలిసేలా సమర్పిస్తామని ఉద్యోగులు హెచ్చరించారు. 'ఉయ్ వాంట్ జస్టిస్', 'ప్రమోషన్ ఫస్ట్ - ట్రాన్స్ ఫర్ నెక్స్ట్' వంటి నినాదాలతో వారు ఆందోళనను కొనసాగించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

క్లుప్తంగా

పాము కాటుతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగి మృతి


శ్రీనివాస్ మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్ క్వార్టర్‌లో నిద్రిస్తున్న ఉద్యోగిని పాము కాటు వేయడంతో మృతి చెందాడు. స్టీల్‌ప్లాంట్ ట్రాఫిక్ విభాగం జనరల్ ఫోర్‌మెన్ తగరంపూడి శ్రీనివాస్(59) టౌన్‌షిప్‌లో సెక్టార్-11 గ్రౌండ్ క్వార్టర్‌లో కుటుంబంతో నివసిస్తున్నాడు. ఆదివారం రాత్రి ఆయన హాల్లో పడుకున్నాడు. తెల్లవారు సమయంలో పాము కుట్టినట్టు తెలిసింది. నిద్రిస్తున్న కుటుంబ సభ్యులను ఇబ్బంది పెట్టకూడదని ఆయన ఒక్కరే ఉక్కు జనరల్ ఆస్పత్రిలోని క్యాజువాల్టీకి వెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి నగరంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని ఉక్కు ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. స్నేక్ క్యాచర్ కిరణ్ మార్చురీలోని మృతదేహాన్ని పరిశీలించి పాము కాటు అని నిర్ధారించారు. శ్రీనివాస్‌కు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పిల్లలిద్దరు విదేశాల్లో ఉన్నారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జీవీఎంసీ ఉద్యోగి ఆకస్మిక మృతి


మృతుడు కిరణ్‌కుమార్

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ జోన్-3 పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న పి. కిరణ్‌బాబు (50) సోమవారం ఉదయం ఆకస్మికంగా మృతిచెందాడు. ద్వారకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ద్వారకా పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాటాకీస్ రోడ్డులో ఉన్న ప్రభుత్వ కంటి ఆస్పత్రి సమీపంలోని సులభ్ కాంప్లెక్స్‌కు కిరణ్‌బాబు ఉదయం 11 గంటల సమయంలో మల మూత్ర విసర్జనకు వెళ్లారు. చాలాసేపటి వరకు ఆయన బయటకు రాకపోవడంతో, సులభ్ కాంప్లెక్స్ నిర్వాహకులు లోపల పరిశీలించమని అక్కడున్న ఒక వ్యక్తికి చెప్పారు. ఆ వ్యక్తి పైనుంచి చూడగా, కిరణ్‌బాబు లోపల పడిపోయి ఉన్నాడు. వెంటనే సులభ్ కాంప్లెక్స్ సిబ్బంది ద్వారకా పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గేటును తొలగించి చూడగా, అప్పటికే కిరణ్‌బాబు మృతిచెందాడు. కిరణ్‌బాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ద్వారకా స్టేషన్ సీఐ రమణ ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ అప్పలరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలుష్యంలో కలిసిన లక్ష్యం

- కాలుష్య నియంత్రణకు కూటమి మేయర్ మంగళం
- సెల్లార్‌లో ఉద్యోగులు..సిబ్బంది ద్విచక్ర వాహనాలు
- గత మేయర్ ఆధ్వర్యంలో కాలుష్య నియంత్రణకు చర్యలు


సెల్లార్‌లో యథావిధిగా ఉద్యోగులు, సిబ్బంది ద్విచక్రవాహనాలు

దాబాగార్డెన్స్: కాలుష్య రహిత నగరంగా విశాఖను మార్చాలనే సంకల్పంతో మాజీ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి చేపట్టిన కార్యక్రమానికి ప్రస్తుత కూటమి మేయర్ పీలా శ్రీనివాసరావు మంగళం పాడారు. గతంలో ప్రతి సోమవారం వ్యక్తిగత వాహనాలను వదిలి, ప్రజా రవాణాను ఉపయోగించడం ద్వారా కాలుష్య నియంత్రణకు ఆమె ప్రయత్నించారు. దీనికి జీవీఎంసీ అధికారులు, ఉద్యోగులు కొంతమేర సహకరించేవారు. అయితే అవిశ్వాస తీర్మానం ద్వారా గత మేయర్‌ను గద్దె దించిన కూటమి కార్పొరేటర్లు, కాలుష్య నియంత్రణపై ఆమె తీసుకున్న నిర్ణయాలను విస్మరించారు. కూటమి మేయర్‌గా ఎన్నికైన పీలా శ్రీనివాసరావు ప్రతి సోమవారం వ్యక్తిగత వాహనంలోనే జీవీఎంసీకి వస్తున్నారు. కేవలం మేయర్ మాత్రమే కాకుండా, జీవీఎంసీ ఉద్యోగులు, సిబ్బంది కూడా ఇదే మార్గాన్ని అనుసరిస్తున్నారు. గతంలో జీవీఎంసీ ప్రధాన ద్వారం వరకు మాత్రమే వాహనాల్లో వచ్చిన అధికారులు, ఇప్పుడు నేరుగా కార్యాలయం లోపలికి వాహనాలను తీసుకువస్తున్నారు. గత మేయర్ హరి వెంకట కుమారి కాలుష్య నియంత్రణకు అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను లేదా సైకిళ్లను ఉపయోగించడం ద్వారా కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని ఆమె నగర ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలకు వివరించారు. కానీ ప్రస్తుత పరిస్థితి చూస్తుంటే కాలుష్య నియంత్రణకు చేపట్టిన ప్రయత్నాలకు అడ్డుకట్ట పడినట్లు కనిపిస్తోంది.

కాలుష్య నియంత్రణకు కృషి చేశా



నగరంలో విపరీతంగా పెరిగిపోతున్న కాలుష్య నియంత్రణకు..నగర మేయర్(నాలుగేళ్ల పాటు)గా..నగర పౌరురాలిగా తన వంతు కృషి చేశా. ప్రజల్లో అవగాహన పెంచాం. కాలుష్య నియంత్రణకు ప్రజల్ని భాగస్వాముల్ని చేశాం. ఎన్నో కార్యక్రమాలు చేపట్టాం. కాలుష్య నియంత్రణ గాడిన పడతున్న సమయంలో కూటమి మేయర్ మంగళం పాడడం బాధాకరం. అధికారులు,ఉద్యోగులు,సిబ్బంది కూడా కాలుష్య నియంత్రణ గాలికొదిలేయడం బాధాకరం.

–గొలగాని హరి వెంకటకుమారి, మాజీ మేయర్,

వైద్య ఆరోగ్యశాఖలో నర్సుల అక్రమ బదిలీలు

- గడువు ముగిసినా ఆగని స్థానచలనం
- వెనుక తేదీతో అడ్డగోలు వ్యవహారం

మహారాణిపేట: వైద్య ఆరోగ్యశాఖలో నర్సుల బదిలీల గడువు ఈ నెల 19తో ముగిసినప్పటికీ, ఆ తర్వాత కూడా వెనుక తేదీలతో అక్రమ బదిలీలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత రెండు రోజుల్లో పలువురు స్టాఫ్ నర్సులకు బదిలీ, పోస్టింగ్ ఉత్తర్వులు జారీ అయినట్లు తెలుస్తోంది. చెస్ట్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి ఆరుగురు నర్సులను బదిలీ చేయగా, సూపరింటెండెంట్ వారిని రిలీవ్ చేయడానికి నిరాకరించారు. నర్సులు లేకుండా ఎలా విధులు నిర్వర్తించాలని ప్రశ్నిస్తూ, బదిలీ అయిన వారి స్థానంలో కొత్తవారిని నియమించాలని డిమాండ్ చేశారు. దీంతో కేజీహెచ్‌లోని ఆరుగురు నర్సులను టీబీ ఆస్పత్రికి కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మానసిక దివ్యాగులైన పిల్లలున్న ఒక తల్లిని కేజీహెచ్ నుంచి ఆంధ్ర మెడికల్ కాలేజీకి బదిలీ చేయగా, ఇప్పుడు ఆమెకు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో పోస్టింగ్ ఇచ్చారు.

కేజీహెచ్‌లోని మరో ఇద్దరు నర్సులకు ప్రభుత్వ మానసిక ఆస్పత్రిలో పోస్టింగ్‌లు లభించాయి. 55 నుంచి 60 ఏళ్ల మధ్య వయసున్న 19 మంది నర్సులను అల్లూరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేశారు. అయితే వీరిలో ఎవరూ విధుల్లో చేరలేదు. వారంతా కోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ బదిలీల ప్రక్రియ పారదర్శకంగా జరగడం లేదని, నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నాయని నర్సు సంఘాలు ఆరోపిస్తున్నాయి.

వీధి విక్రయదారుల నిరసన


నిరసన చేస్తున్న వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ సభ్యులు

టీచర్స్‌రోడ్డు: వీధి విక్రయదారుల చట్టం, 2014లోని 39 సెక్షన్లు, 18 సౌకర్యాలతో కూడిన నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వీధి విక్రయదారుల కార్మిక ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెడ్డి వేంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేంకటేశ్వరరావు మాట్లాడుతూ, వీధి విక్రయదారుల సంక్షేమం కోసం సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన జీవోలు, మెమోలను జీవీఎంసీ అధికార యంత్రాంగం పక్కదారి పట్టించిందని ఆరోపించారు. 2013 నుంచి 2025 వరకు జరిగిన ఆర్థిక అవినీతిపై, ఫైళ్ల తారుమారుపై జిల్లా కలెక్టర్‌తో సహా జీవీఎంసీ అధికార యంత్రాంగంపై జ్యుడిషియల్ విచారణ జరిపి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర గెజిట్ 7 ఆఫ్ 2014, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు జీవో ఎంఎస్ 137లో పొందుపరిచిన వీధి విక్రయదారుల చట్టంపై వీధి విక్రయదారుల యూనియన్లతో జాయింట్ సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. జీవీఎంసీ పరిధిలోని 8 జోన్లలో టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులను బ్యాలెట్ ద్వారా ఎన్నుకునే హక్కును ప్రతి వీధి విక్రయదారుడికి కల్పించాలన్నారు.

హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం జీవీఎంసీ 8 జోన్ల పరిధిలోని 2 లక్షల మంది వీధి విక్రయదారులకు వ్యక్తిగత ఫొటో గుర్తింపు కార్డులు, వ్యాపార భద్రతతో కూడిన కుటుంబ ఫొటోతో వెండింగ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్ చేసి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వీధి విక్రయదారుల సంక్షేమం కోసం జీవీఎంసీ పరిధిలోని జనసంచార స్థలాల్లో హాకర్ జోన్లు, షెడ్లు, సంతలు, మొబైల్ మార్కెట్లు, వెండింగ్ మార్కెట్లను నిర్మించాలని కూడా పిలుపునిచ్చారు. ఈ డిమాండ్లను వెంటనే నెరవేర్చకపోతే తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అర్జన్ పరిశ్రమలో ప్రమాదం

ఇద్దరికి స్వల్ప గాయాలు

పరవాడ : జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మాసిటీ (జేఎన్ ఫార్మాసిటీ)లోని ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్) ప్రాంగణంలో ఉన్న అర్జన్ ఫార్మా పరిశ్రమలో సోమవారం తెల్లవారుజామున రసాయనం లీకై ఇద్దరు కార్మికులు స్వల్పంగా గాయపడ్డారు. పరవాడ సీఐ ఆర్. మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ ప్రమాదంలో పరిశ్రమ ఉద్యోగి తులసి (పరవాడ మండలం, దలాయిపాలెం), కాంట్రాక్టు కార్మికుడు జగదీష్ (గాజువాక) గాయపడ్డారు. రియాక్టర్ల వద్ద పైపులైన్ మరమ్మతులు చేస్తుండగా, పొటాషియం హైడ్రాక్సైడ్ అనే రసాయనం పైపు నుంచి లీకై వారి ముఖాలపై పడింది. వెంటనే వారిద్దరినీ నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. తులసి డిశ్చార్జ్ కాగా, జగదీష్ ఇంకా చికిత్స పొందుతున్నారని సీఐ మల్లికార్జునరావు చెప్పారు. ప్రమాదానికి పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకర్‌రావు, ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. పరిశ్రమలో భద్రతా ప్రమాణాలను విస్మరించడం వల్లే తరచూ ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని వారు డిమాండ్ చేశారు.

రేపు పలు ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

మద్దిలపాలెం : ఆంధ్రా యూనివర్సిటీ మోడల్ కెరీర్ సెంటర్‌లో పలు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాల భర్తీకి ఈనెల 25వ తేదీ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని సెంటర్ డిప్యూటీ చీఫ్ కె.దొరబాబు పేర్కొన్నారు. యోకోమా కంపెనీలో ప్రొడక్షన్ విభాగంలో 100 ఖాళీలు ఉన్నాయని, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాసైన 25 ఏళ్లలోపు మహిళలు అర్హులని పేర్కొన్నారు. వేతనం రూ.12–రూ.15 వేలు ఉంటుందన్నారు. డబ్ల్యూఎన్ఎస్‌లో 50 ఖాళీలున్నాయని, డిగ్రీ పాసైన 26 ఏళ్లలోపు వారు అర్హులని వేతనం రూ.15 వేలు ఉంటుందన్నారు. ఆప్టివల్ హెల్త్ సొల్యూషన్‌లో 120 ఖాళీలున్నాయని, 10వ తరగతి నుంచి డిగ్రీ వరకు గల 18–26 ఏళ్లలోపు వారు అర్హులని, వేతనం రూ.11–రూ.25 వేలు ఇస్తారని తెలిపారు. హెల్త్‌కేర్‌లో బీసీజీ, స్టాఫ్‌నర్సు ఖాళీలు 50 ఉన్నాయని, ఎంపీహెచ్‌ఏ (ఎఫ్), బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం పూర్తిచేసినవారు అర్హులని పేర్కొన్నారు. వేతనం నెలకు రూ.12–రూ.35 వేలు ఉంటుందన్నారు. ఐ ఫోన్ మాన్యుఫ్యాక్చరింగ్‌లో 60 ఖాళీలున్నాయని, ఇంటర్ అర్హత గల మేల్/ ఫీమేల్ అభ్యర్థులు అర్హులని తెలిపారు. వేతనం రూ.18 వేలు ఉంటుందన్నారు. అపోలో ఫార్మసీల్లో ఫార్మాసిస్టులు 20, ఆర్‌టీఏ 35 ఖాళీలున్నాయని వేతనం రూ.11–రూ.25 వేలు ఇస్తారన్నారు. మరిన్ని వివరాలకు 0891–2844184 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

స్టీల్‌ప్లాంట్‌లో మరో రెండు విభాగాల ప్రైవేటీకరణ

సాక్షి, విశాఖపట్నం: స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మరో రెండు కీలక విభాగాలైన రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్ఎంహెచ్‌పీ), సింటర్ ప్లాంట్‌ల ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేసింది. ఈ మేరకు ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ)కు దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి అవసరమైన ముడి పదార్థాలను సరఫరా చేయడంలో ఆర్ఎంహెచ్‌పీ విభాగం కీలక పాత్ర పోషిస్తోంది. ఈ విభాగంలో ఉన్న ఓర్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఓహెచ్‌పీ), కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (సీహెచ్‌పీ)ల ద్వారా వివిధ ముడి పదార్థాలను ప్రధాన విభాగాలకు సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం, టెక్నలాజికల్ అప్‌కీప్ ఆఫ్ వేగన్ టిప్లర్స్, విభాగం టిప్లర్లు, స్టాకింగ్ స్ట్రీమ్‌ల మొత్తం మెయింటెనెన్స్, హౌస్‌కీపింగ్ పనులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించేందుకు ఈ ఈవోఐని విడుదల చేశారు. జూలై 10వ తేదీలోగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. జూలై 11న బిడ్లను తెరవనున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. మరో ప్రధాన విభాగమైన సింటర్ ప్లాంట్‌లో తయారయ్యే సింటర్ బ్లాస్ట్‌ఫర్నేస్‌లో హాట్‌మెటల్ ఉత్పత్తికి కీలకంగా ఉంటుంది. ఈ విభాగంలోని రిసీవింగ్ బిన్స్, లైమ్‌స్టోన్ అండ్ డోలమైట్ క్రషింగ్ బిల్డింగ్ తదితర పలు సెక్షన్లకు సంబంధించి కాంప్రహెన్సివ్ టెక్నికల్ మేనేజ్‌మెంట్ అండ్ మెయింటెనెన్స్‌కు కూడా ఈవోఐ విడుదల చేశారు. ఈ విభాగం ఈవోఐకి దరఖాస్తు గడువు జూలై 11గా నిర్ణయించారు. జూలై 12న మధ్యాహ్నం బిడ్లు తెరవనున్నారని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

మురళీనగర్ : పాలిటెక్నిక్ కాలేజీల్లో ప్రవేశాలకు సంబంధించిన పాలిసెట్ కౌన్సెలింగ్ సోమవారం కొనసాగింది. ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇనిస్టిట్యూట్ (గైస్), కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో హెల్ప్‌లైన్ కేంద్రాలు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో సందడిగా కనిపించాయి. గైస్‌లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ పర్యవేక్షణలో 32,001 నుంచి 40,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించగా 308 మంది సర్టిఫికెట్లు పరిశీలన చేశారు. గైస్‌లో మంగళవారం 50,001 నుంచి 59,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్‌కు హాజరు కావాల్సి ఉంటుంది. పాలిటెక్నిక్ కాలేజీలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో 40,001 నుంచి 50,000 ర్యాంకు వరకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 336 మంది సర్టిఫికెట్లు పరిశీలన చేశారు. మంగళవారం 59,001 నుంచి 68,000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

సమాచార శాఖ డీడీగా సదారావు



మహారాణిపేట : సమాచార పౌర సంబంధాల శాఖ రెగ్యులర్ డిప్యూటీ డైరెక్టర్(డీడీ)గా కె.సదారావు సోమ వారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు నెల్లూరు డీడీగా సేవలందించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖ ఉప సంచాలకులుగా నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇన్‌చార్జిగా డీడీగా వ్యవహరించిన డి.రమేశ్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా సమాచార పౌర సంబంధాల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు వి.మణిరామ్‌ను మురళీనగర్‌లోని తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

పీజీఆర్ఎస్‌కు 383 వినతులు


వినతులు స్వీకరిస్తున్న డీఆర్‌వో భవానీ శంకర్

మహారాణిపేట: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వివిధ సమస్యలపై ప్రజల నుంచి 383 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. వీటిలో రెవెన్యూ శాఖకు 115, పోలీసు శాఖకు 28, జీవీఎంసీకి 94, ఇతర విభాగాలకు సంబంధించి 146 వినతులు వచ్చాయి.

జిల్లా రెవెన్యూ అధికారి భవానీ శంకర్, డిప్యూటీ కలెక్టర్లు శేషశైలజ, మధుసూధన రావు, చీఫ్ సిటీ ప్లానింగ్ ఆఫీసర్ ప్రభాకర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కలెక్టర్ కార్యాలయం, మండల కార్యాలయాల్లో ప్రతి సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహిస్తారని, అర్జీదారులు 1100 కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి తమ ఫిర్యాదుల స్థితిని తెలుసుకోవచ్చని, సందేహాలు అడగవచ్చని, కొత్త ఫిర్యాదులు కూడా నమోదు చేయవచ్చని డీఆర్వో తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇవ్వండి



ఏపీ ట్రాన్స్‌కోలో సబ్ ఇంజినీర్ పోస్టుకు అన్ని అర్హతలు ఉన్నా తనకు ఉద్యోగం ఇవ్వడం లేదని గాజువాకకు చెందిన జలుమూరి శ్రీలక్ష్మి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వినతి పత్రం సమర్పించింది. డిప్లొమో (ఎలక్ట్రికల్), బీఈ (ఎలక్ట్రికల్) ఉత్తీర్ణురాలినైనప్పటికీ, ఎన్నోసార్లు దరఖాస్తు చేసినా ఉద్యోగం రాలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. తనకంటే తక్కువ అర్హతలు ఉన్న వారికి ఉద్యోగాలు ఇస్తున్నారని, రోస్టర్ విధానాన్ని, మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం లేదని ఆమె ఆరోపించింది. తనకు న్యాయం చేసి ఉద్యోగం కల్పించాలని ఆమె వేడుకుంది.

అర్జీలు స్వీకరించిన మేయర్


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక యథావిధిగా సాగింది. మేయర్ పీలా శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తితో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 77 ఫిర్యాదులు అందాయి. వాటిలో అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి 49, ఇంజినీరింగ్ విభాగానికి 10, జీవీఎంసీ అడ్మినిస్ట్రేషన్ అండ్ అకౌంట్స్ విభాగానికి 4, రెవెన్యూ విభాగానికి 6, ప్రజారోగ్య విభాగానికి 4, మొక్కల విభాగానికి 1, యూసీడీకి 3 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అధికారులు స్వీకరించిన అర్జీలు, ఫిర్యాదులను ప్రతిరోజూ పరిశీలిస్తూ, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అదనపు కమిషనర్ రమణమూర్తి ఆదేశించారు. ప్రజలు ఒకే సమస్యపై మళ్లీ మళ్లీ ఫిర్యాదు చేయడానికి రాకుండా, వాటిని సత్వరమే పరిష్కరించే దిశగా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, చీఫ్ సిటీ ప్లానర్ ప్రభాకరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డితో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ కల్పించండి


జిల్లా రెవెన్యూ అధికారికి వినతి పత్రం సమర్పిస్తున్న గంట్ల శ్రీనుబాబు, నారాయణ్ తదితరులు

మహారాణిపేట: జర్నలిస్టుల పిల్లలకు గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా విద్యాసంస్థల్లో ఫీజు రాయితీ కల్పించాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఏపీ బ్రాడ్‌కాస్ట్, స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ అసోసియేషన్ల ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) భవానీ శంకర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో ఇప్పటికే జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీపై ఉత్తర్వులు జారీ అయ్యాయని, విశాఖ జిల్లాలోనూ వంద శాతం రాయితీ కల్పించాలని జర్నలిస్టు నాయకులు గంట్ల శ్రీనుబాబు, పి.నారాయణ్‌లు డీఆర్‌వోను కోరారు. గతంలో కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ కొన్ని పాఠశాలలు ఫీజు రాయితీని నిరాకరించాయని తెలిపారు. జర్నలిస్టుల వినతిపై డీఆర్‌వో సానుకూలంగా స్పందించి, డీఈవో ప్రేమ కుమార్‌ను పిలిచి ఉత్తర్వులు పరిశీలించి తక్షణమే కలెక్టర్‌కు ఫైల్ పంపాలని ఆదేశించారు. అలాగే జర్నలిస్టులకు ఉచిత వైద్య పరీక్షల విషయం కలెక్టర్ దృష్టిలో ఉందని, త్వరలో చర్యలు తీసుకుంటారని డీఆర్‌వో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ బ్రాడ్‌కాస్ట్ విశాఖ జిల్లా అధ్యక్షుడు ఇరోతి ఈశ్వరరావు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

శాన్‌ఫ్రాన్సిస్కోలో 'సెంచూరియన్' ప్రదర్శన


శాన్ ఫ్రాన్సిస్కో డీఏసీకి ప్రాతినిధ్యం వహించిన సీయూటీఎం ప్రతినిధులు

భువనేశ్వర్: సెంచూరియన్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ–మేనేజ్‌మెంట్ (సీయూటీఎం) అరుదైన ఘనత సాధించింది. శాన్‌ఫ్రాన్సిస్కోలో ప్రారంభమైన 62వ డిజైన్ ఆటోమేషన్ కాన్ఫరెన్స్ (డీఏసీ)లో పాల్గొనే అరుదైన అవకాశాన్ని చేజిక్కించుకోవడమే కాకుండా తన సామర్థ్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకుంది. ఈ కాన్ఫరెన్స్ ఈ నెల 22న ప్రారంభమైంది, 25 వరకు కొనసాగనుంది. సెమీకండక్టర్, డిజైన్ ఆటోమేషన్ పరిశ్రమ రంగంలో అంతర్జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో సెంచూరియన్ ప్రాతినిధ్యం వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. 'చిప్స్ టు సిస్టమ్స్' అనే శీర్షికతో నిర్వహిస్తున్న డీఏసీ కార్యక్రమానికి ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ), సెమీకండక్టర్ టెక్నాలజీలు, సిస్టమ్ ఇన్నోవేషన్ రంగంలో దిగ్గజాలు హాజరు కావడం విశేషం. వర్సిటీ ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు ఆధ్వర్యంలో ప్రొఫెసర్ డాక్టర్ చంద్రశేఖర్ దాస్, లక్ష్మీకాంత్ సుతార్‌లతో కూడిన బృందం సెంచూరియన్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఈ సందర్భంగా ప్రొఫెసర్ డీఎన్ రావు మాట్లాడుతూ ప్రపంచ స్థాయి వేదికపై సామర్థ్యాన్ని ప్రదర్శించిన తొలి వర్సిటీగా సెంచూరియన్ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. వర్సిటీలో సెమీకండక్టర్ టెక్నాలజీ పాఠ్యాంశాలు మెరుగుపరచడానికి మార్ఫ్యూ సెమీ కండక్టర్స్‌తో ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. రానున్న కాలంలో ప్రపంచ స్థాయిలో సెంచూరియన్ తన ఉనికి చాటుకుంటుందని ఆశాభవం వ్యక్తం చేశారు.

ఏయూ లా విద్యార్థి సోమశేఖర్ అరుదైన రికార్డు

ఏడు సెంట్రల్ యూనివర్సిటీల్లో టాప్ ర్యాంకులు


సోమశేఖర్

విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ లా కాలేజీలో చివరి సంవత్సరం చదువుతున్న కొండేటి సోమశేఖర్ దేశవ్యాప్తంగా నిర్వహించిన పోటీ పరీక్షల్లో అసాధారణమైన ప్రతిభ చూపించాడు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) సంయుక్తంగా నిర్వహించిన కామన్(సెంట్రల్) యూనివర్సిటీ ప్రవేశ పరీక్ష- పీజీ (సీయూఈటీ-పీజీ 2025)లో సోమశేఖర్ నాయశాస్త్ర విభాగంలో 155 మార్కులు సాధించి రాష్ట్రంలో మూడో ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఫలితంతో దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీల మెరిట్ ఆధారిత కౌన్సెలింగ్ ప్రక్రియలో సోమశేఖర్ ఏడు కేంద్ర విశ్వవిద్యాలయాల్లో జనరల్ కేటగిరీలో టాప్ ర్యాంకులు దక్కించుకున్నాడు. కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీ జనరల్ కేటగిరీలో 4వ ర్యాంక్, కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో 6వ ర్యాంక్, తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీలో 8వ ర్యాంక్, కాశ్మీర్ సెంట్రల్ యూనివర్సిటీలో 8వ ర్యాంక్, పంజాబ్ సెంట్రల్ యూనివర్సిటీలో 14వ ర్యాంక్, మధ్యప్రదేశ్ డాక్టర్ హరిసింగ్ గౌర్ సెంట్రల్ యూనివర్సిటీలో 42వ ర్యాంక్, సౌత్ బిహార్ సెంట్రల్ యూనివర్సిటీలో మెరిట్ లిస్టులో స్థానం సంపాదించాడు. ఈ ర్యాంకులతో కొండేటి సోమ శేఖర్‌కు 7 సెంట్రల్ యూనివర్సిటీల నుంచి ఎల్ఎల్ఎమ్ ప్రవేశానికి అవకాశం లభించింది. అయితే సోమశేఖర్ యూనివర్సిటీల మెరిట్, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంక్ ఆధారంగా పంజాబ్ సెంట్రల్ యూనివర్సిటీని ఎంపిక చేసుకుని ఎల్ఎల్ఎంలో ప్రవేశం పొందాడు.

27న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ (ఎన్‌సీఎస్‌సీ) ఆధ్వర్యంలో ఈనెల 27న సుమారు 100 ఉద్యోగ ఖాళీల భర్తీకి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు సెంటర్ ఉప ప్రాంతీయ అధికారి నిట్టాల శ్యామ్‌సుందర్ సోమవారం ప్రకటించారు. ఈ జాబ్‌మేళాలో ఫార్మసిస్ట్, సర్వీస్ అడ్వైజర్, ఫ్లోర్ ఇన్‌చార్జ్, ఫార్మసీ ట్రైనీ, టెక్నికల్ పర్సన్ వంటి వివిధ ఉద్యోగాలకు పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ, ఎం/బీ/డీ ఫార్మసీ ఉత్తీర్ణత సాధించిన 18–30 ఏళ్ల వయస్సు గల స్త్రీ, పురుష అభ్యర్థులు అర్హులు. ఎంపికైన వారికి విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో కంచరపాలెంలోని జిల్లా ఉపాధి కార్యాలయం ఎన్‌సీఎస్‌సీకి ఉదయం 10 గంటలకు హాజరు కావాలని శ్యామ్‌సుందర్ సూచించారు.

చికెన్ (కిలో)

ఫారం ధర : రూ.90
బ్రాయిలర్ (లైవ్): రూ.110
స్కిన్ : రూ.190
స్కిన్ లెస్ : రూ.200

కోడి గ్రుడ్ల ధరలు

(వంద)
విశాఖపట్నం : రూ.565
విజయనగరం : రూ.569
శ్రీకాకుళం: రూ.569